సృజన సాహిత్యం

జీవిత వైరుధ్యాలకు అక్షర దర్పణం: 'గాజుకళ్ళు'

సమాజాన్ని చదవడం ఒక ఎత్తయితే, ఆ సమాజంలో నిత్యం నలిగిపోతున్న మనుషుల జీవితాలను అక్షరాల్లో సజీవంగా ఆవిష్కరించడం మరో ఎత్తు. ముఖ్యంగా స్త్రీల అనుభవాలు, కుటుంబ సంబంధాల్లో దాగిన వైరుధ్యాలు, పేదరికం సృష్టించే తీరని సంక్షోభాలు, కులవివక్షతో కుంచించుకుపోయే బతుకులను కథావస్తువులుగా మలచాలంటే సూక్ష్మమైన పరిశీలనతో పాటు గాఢమైన సామాజిక స్పృహ కూడా ఎంతో అవసరం.

సుసంపన్నమైన తెలుగు కథా సాహిత్య రంగంలో, సమాజంలోని రుగ్మతలను నిర్భయంగా ఎత్తిచూపుతూ, మూలాల్లోంచి మార్పును కోరుకునే ప్రగతిశీల రచయిత్రులలో జి. నిర్మలారాణి గారిది ప్రత్యేక స్థానం. ఆమె కలం నుంచి జాలువారిన 'గాజుకళ్ళు' కథా సంపుటి ఆధునిక తెలుగు కథానికా సాహిత్యంలో ఒక సుస్థిరమైన మైలురాయిగా నిలుస్తుంది. స్త్రీల జీవితాల్లోని నిరంతర సంఘర్షణలను, అట్టడుగు వర్గాల బతుకు పోరాటాలను, సమాజంలో లోతుగా వేళ్లూనుకున్న వివక్షలను ఈ సంపుటి విభిన్న కోణాల్లో ఆవిష్కరిస్తుంది.

రాయలసీమ ప్రాంతీయ కరువు ఛాయలు, మధ్యతరగతి జీవితాల డొల్లతనం, స్త్రీల ఆత్మగౌరవ పోరాటాలు ఇందులోని ప్రధాన ఇతివృత్తాలు.

విద్య నుంచి సాహిత్యం వరకు: జి. నిర్మలారాణి గారు 1950 అక్టోబరు 27న గుంటూరు జిల్లాలో జి.ఎం. రాజమ్మ, జి. ప్రసాదరావు దంపతులకు జన్మించారు. వివాహానంతరం ఆమె రాయలసీమలోని అనంతపురంలో స్థిరపడ్డారు. మానవ హక్కుల వేదికతో సుదీర్ఘ అనుబంధం కలిగిన ఎ. చంద్రశేఖర్ గారు ఆమె జీవిత సహచరులు. ఆమె విద్యాభ్యాసం కేవలం ఒక రంగానికే పరిమితం కాలేదు. చరిత్ర, రాజనీతి శాస్త్రం, మనస్తత్వశాస్త్రం వంటి విభిన్న సామాజిక అంశాల్లో ఎం.ఏ. పట్టాలు పొందడంతో పాటు ఎం.ఎడ్., బి.ఎల్. కూడా పూర్తి చేశారు. కౌన్సెలింగ్‌లో పీజీ డిప్లొమా, ఎస్.వి. యూనివర్సిటీలోని మ్యూజిక్ & డాన్స్ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ మ్యూజిక్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించడం ఆమె బహుముఖ ప్రజ్ఞకు ప్రత్యక్ష నిదర్శనం.

ఆమెకున్న ఈ విస్తృత విద్యాభ్యాసం, ముఖ్యంగా మనస్తత్వశాస్త్రంపై ఆమె సాధించిన పట్టు, మానవ సంబంధాల లోతులను, సామాజిక వైరుధ్యాలను, పాత్రల అంతరంగాన్ని విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఎంతగానో దోహదపడ్డాయి. అనంతపురంలో అధ్యాపకురాలిగా సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన ఆమె, సైకలాజికల్ కౌన్సెలింగ్ చేయడంతో పాటు, తన అపారమైన పరిజ్ఞానాన్ని సామాన్యుల కోసం వెచ్చిస్తున్నారు.

'మనలో మనం' -- నిర్మలా రాణి సారథ్యంలో సాహితీ సందడి: ప్రస్తుత డిజిటల్ యుగంలో ఒక వాట్సాప్ సమూహాన్ని ప్రారంభించడం సులభమే, కానీ దాన్ని నిరంతరం సృజనాత్మకంగా నడిపిస్తూ సభ్యుల్లోని ప్రతిభకు పదును పెట్టడం మాత్రం ఒక యజ్ఞం లాంటిదే. ఈ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్న నిర్మలారాణి గారు అభినందనీయులు. 'మనలో మనం' సమూహం కేవలం ఉదయం పలకరింపులకే పరిమితమైన వేదిక కాదు; విభిన్న సాహిత్య ప్రక్రియలకు, సృజనాత్మక ఆలోచనలకు అదొక నిలయం.

తొలిపొద్దు సందేశాలు, ఈ తరం కథకులు-కవులు-కళాకారుల పరిచయం, సరిగమల సమాలోచన, నా పని-నా ఆనందం, చెప్పాలనుంది, సీమ రచయితల పరిచయం, నాకు నచ్చిన సంపాదకీయం వంటి ఎన్నో అద్భుతమైన శీర్షికలతో పాటు, శాస్త్రీయ నృత్యాలు, పండుగల విశేషాలకు ఇందులో చోటు కల్పించడం ఆమె విశాల దృక్పథానికి నిదర్శనం. పురస్కారాలు, సన్మానాల ఆడంబరాలకు దూరంగా ఉంటూ, కేవలం తన రచనల ద్వారా సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న నిజమైన సాహిత్యకారిణి ఆమె. 'సైకాలజీ టుడే' పత్రికలో కుటుంబ కౌన్సెలింగ్‌కు సంబంధించిన వ్యాసాలతో పాటు, స్త్రీల సమస్యలను ప్రతిబింబించే ఎన్నో కథలు రచించారు.

'గాజుకళ్ళు' - సమాజానికి అద్దం పట్టిన కథలు: ఈ సంపుటిలోని పదకొండు కథలు ప్రధానంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల జీవిత వాస్తవాలను కళ్లకు కడతాయి. రాయలసీమ అనంతపురం ప్రాంతంలో పదేపదే సంభవించే కరువు, ఆకలి కేకలు, వలసలు, వాటివల్ల పేద బతుకులు ఎలా చితికిపోతాయో ఈ కథలు నిర్దయగా ఆవిష్కరిస్తాయి. ముఖ్యంగా 'గాజుకళ్ళు' కథ బతుకుదెరువు కోసం వలస వెళ్లాల్సిన దుస్థితిని, పేదరికం కారణంగా స్త్రీలు ఎదుర్కొనే దోపిడీని, వారి నిస్సహాయ జీవితాలపై సమాజం చెలాయించే క్రూరమైన పెత్తనాన్ని హృదయవిదారకంగా చిత్రిస్తుంది.

'మానవత్వం' కథలో అంజయ్య అనే రిక్షా కార్మికుడి పాత్ర ద్వారా రచయిత్రి మరో సామాజిక వైరుధ్యాన్ని ఆవిష్కరించారు. కరువుతో పల్లెను విడిచి పట్టణానికి వచ్చిన అంజయ్య ఆర్థికంగా పేదవాడైనా, తోటి మనిషి కష్టాన్ని అర్థం చేసుకునే గొప్ప మానవీయ సంస్కారం కలిగినవాడు. మరోవైపు, కేవలం డబ్బు కోసం రోగి బాధను ఏమాత్రం పట్టించుకోని ఓ మహిళా వైద్యురాలి పాత్రను సృష్టించడం ద్వారా.. ఆర్థిక స్థాయికి, మానవీయ విలువలకు మధ్య ఉన్న తీవ్ర అంతరాన్ని రచయిత్రి ఎత్తిచూపారు. సంపద అనేది సంస్కారానికి కొలమానం కాదని ఈ కథ బలంగా చెబుతుంది.

కుటుంబ సంబంధాల్లో సమానత్వపు ప్రశ్న: 'వికసించిన అంతరంగం' కథ కుటుంబ వ్యవస్థలో జరిగే స్త్రీల శ్రమ దోపిడీ గురించి మాట్లాడుతుంది. ఉద్యోగం చేస్తూనే ఇంటి పనంతా ఒంటరిగా మోస్తున్న జ్యోతికి, ఆమె భర్త కాస్త సహాయం చేసినప్పుడు.. అత్తగారు, ఆడపడుచులు తమ భర్తల సహకారం గురించి గొప్పలు చెబుతూ జ్యోతిని దెప్పిపొడవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురవుతుంది. భర్త మౌనం వహించడంతో ఆత్మగౌరవం కోసం పసిపాపతో కలిసి తన తమ్ముడి ఇంటికి వెళ్తుంది. అక్కడ తన తమ్ముడు కూడా భార్యకు ఎంతో సంతోషంగా వంటలో సహాయం చేయడం చూసి, "కుటుంబంలో పరస్పర సహకారమే నిజమైన అనుబంధం" అని గ్రహించడంతో ఆమె ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది.

'ఎంతెంత దూరం!?' అనే కథ.. పిల్లల పెంపకంలో సమాజం చూపే వివక్షను, ఆడపిల్లలపై చిన్నప్పటి నుంచే విధించే కఠినమైన కట్టుబాట్లను చర్చిస్తుంది. అఘాయిత్యాలకు గురైనప్పుడు బాధితులనే సర్దుకుపోమని చెప్పే సమాజపు కుసంస్కారాన్ని ఈ కథ నిలదీస్తుంది.



'రిగ్రెట్స్' కథ వృద్ధ తల్లిదండ్రుల పట్ల నేటి తరానికి ఉండాల్సిన ప్రేమ, బాధ్యతలతో పాటు మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను చర్చిస్తుంది. తండ్రి మరణవార్త విని క్షణికంగా ఆనందపడిన కొడుకు, ఆ తర్వాత తండ్రి బ్రతికే ఉన్నాడని తెలిసి పశ్చాత్తాపపడే తీరు అత్యంత సహజంగా, మనసుకు హత్తుకునేలా చిత్రించబడింది.

'బొమ్మల పెళ్ళి' కథలో వివాహమే స్త్రీ జీవితానికి ఏకైక భద్రత అనే సంప్రదాయ భావనను రచయిత్రి తీవ్రంగా ప్రశ్నిస్తారు. సమాజంలో పెళ్లి కాని మహిళలు ఎదుర్కొనే మానసిక ఒత్తిళ్లు, వివాహం తర్వాత భర్త ఆంక్షల వల్ల మహిళలు కోల్పోయే వ్యక్తిగత స్వేచ్ఛ గురించి ఈ కథ వివరిస్తుంది. రాధ అనే పాత్ర ద్వారా స్త్రీకి స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన ఎంత ముఖ్యమో తెలియజేస్తారు. అలాగే, 'మూడో అవతారం' కథ.. స్త్రీలు ఉద్యోగం చేయడం మాత్రమే పూర్తి స్వేచ్ఛ కాదని, కుటుంబంలోనూ వారికి నిర్ణయాధికారం, సమాన గౌరవం దక్కాల్సిన అవసరం ఉందని మానస పాత్ర ద్వారా స్పష్టం చేస్తుంది.

ప్రతిఘటనలోనే ఆత్మగౌరవం: 'అధిగమనం' కథ సమాజంలో వ్యవస్థీకృతమైన అన్యాయాలపై ఎక్కుపెట్టిన బాణం. పేదరికం కారణంగా దొంగతనం నేరం మోపబడి పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న ఓబులేసు అనే బాలుడి ద్వారా వ్యవస్థ దౌర్జన్యం బయటపడుతుంది. మరోవైపు, పేదపిల్లలపై తన భార్య శాంతమ్మ చూపిన అణచివేతను భరించలేక సీనప్ప తీవ్రమైన అంతర్మథనానికి లోనవుతాడు. చివరకు ఆ అన్యాయాన్ని ఎదిరించే చైతన్యాన్ని పొంది, ఆ కుటుంబపు అశాంతికి మూలమైన సామాజిక కట్టుబాట్లను అధిగమించి ధైర్యంగా ముందుకు అడుగుపెడతాడు.

'కొత్తస్పర్శ' కథలో భర్త పెట్టే హింసను భరించలేక ఆత్మహత్యకు పాల్పడే విజయలక్ష్మి విషాదాంతం.. ఇందిర అనే మరో స్త్రీలో ఆలోచనను రేకెత్తిస్తుంది. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, హింసాత్మకమైన బంధాన్ని ధిక్కరించి ఆత్మగౌరవంతో జీవించాలనే దృఢమైన నిర్ణయానికి ఇందిర రావడం ఈ కథలో ప్రధానాంశం. 'మామూలు కత కాదు' కథలో కట్నం కోసం భార్యను హత్యచేసి, ప్రమాదంగా చిత్రించే కరకు వ్యక్తుల దుర్మార్గాన్ని రచయిత్రి ఎత్తిచూపారు.

'మలుపు' కథలో కులవివక్షతో పాటు ప్రేమ పేరుతో మోసపోయిన స్త్రీ ఎదుర్కొనే మానసిక క్షోభ ప్రధానంగా నిలుస్తుంది. సునీత పాత్ర తనను మోసగించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడమే పరిష్కారమని భావించదు. తన బిడ్డకు తండ్రిగా అతని బాధ్యతను గుర్తుచేస్తూనే, తనను ఒక మనిషిగా గౌరవించే వ్యక్తితోనే జీవితాన్ని పంచుకోవాలనే ఆత్మగౌరవపూరితమైన వైఖరిని ప్రదర్శిస్తుంది.

కథా శిల్పం - సామాజిక బాధ్యత: కథను నడిపించడంలో రచయిత్రి పాటించిన శైలి, ఔచిత్యం ఎంతో ప్రశంసనీయం. కథలో అనవసరమైన వర్ణనలకు తావివ్వకుండా, ఏది చెప్పాలో అంతే స్పష్టంగా చెప్పడంలో ఆమె గొప్ప సంయమనం పాటించారు. పాత్రల నేపథ్యానికి తగిన సహజసిద్ధమైన సీమ మాండలికాన్ని, అక్కడి జనాల పలుకుబడిని అత్యంత సహజంగా ఉపయోగించడం ద్వారా కథలోని జీవగుణం మరింత బలపడింది.

నిర్మలారాణి కథలు కేవలం సమాజంలోని సమస్యలను చిత్రించడానికే పరిమితం కావు. స్త్రీలు తమ జీవితాలపై తామే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం, అన్యాయాన్ని ముక్తకంఠంతో ప్రశ్నించడం, ఆత్మగౌరవంతో నిలబడడం వంటి ప్రగతిశీల అంశాలను పాఠకుల ముందుకు తెస్తాయి. విద్యావేత్తగా, అద్భుతమైన కథారచయిత్రిగా, మానసిక విశ్లేషకురాలిగా, సమాజం పట్ల పూర్తి బాధ్యత కలిగిన వ్యక్తిగా జి. నిర్మలారాణి గారి ప్రయాణం ఎన్నో విభిన్న కోణాలను కలిగి ఉంది.

ఆమె 'గాజుకళ్ళు' కథా సంపుటి మన చుట్టూ ఉన్న జీవితాలను మరోసారి లోతుగా పరిశీలించమంటుంది. తరతరాలుగా మనకు అలవాటైన వివక్షలను నిర్భయంగా ప్రశ్నించమంటుంది. యాంత్రికమవుతున్న నేటి సమాజంలో అనుబంధాల విలువను చెప్పే ఇలాంటి కథలను చదవడం ఎంతో అవసరం. అదే ఈ కథల ప్రాధాన్యం; అదే నిర్మలారాణి గారి రచనా ప్రయాణంలోని అసలైన ప్రత్యేకత.

- మహాసముద్రం దేవకి
99632 95997

వస్త్రాల తీర్పు

చెట్టు దిగంబరం
ఆకులు రాల్చినా ఎవరూ ప్రశ్నించరు
శిశిరమైనా, వసంతమైనా
పాపం కాదంటారు.

చెరువు దిగంబరం
లోతులు ప్రదర్శించినా
ఎవరూ తీర్పు చెప్పరు.

అవనీ, ఆకాశం దిగంబరం
అనంతాన్ని ఆవిష్కరించినా
అపవాదు లేదు.
ప్రకృతి నగ్నమే, నిందలకు అతీతమే.
కానీ, ఆడవాళ్ళు మాత్రం
వస్త్రాల కొలతలతోనే
విచారణకు నిలబడతారు.

నిండుగా కప్పుకున్నా తప్పుపడతారు
కాస్త ఒళ్ళు కనిపించినా
సంస్కారం లేదంటారు.

నైపుణ్యం, నైతికత,
ఆలోచనలో పదును, అడుగుల్లో ధైర్యం...
ఇన్ని ఉన్నా, ఒక చీర మడతే
ఆమె వ్యక్తిత్వాన్ని కొలిచే ప్రమాణమైంది.
శాస్త్రాలు చదివిన మేధావి కూడా
అక్కడ మూగబోతాడు -
ఆమెను మనిషిగా చూడలేక
కేవలం దేహంగానే కుదించి!

కానీ ఆడవాళ్ళు
ఆ వస్త్రాల పట్టింపుల మధ్యే
విప్లవాలు నడిపారు
విమర్శల ముళ్ళ మధ్యే
విజయాలు సాధించారు.
వాళ్ళ శక్తి చీరలోనో,
చొక్కాలోనో లేదు -
సంకల్పంలో ఉంది,
స్వాభిమానంలో ఉంది.
ఏదో ఒకరోజు ఈ సమాజమే గ్రహిస్తుంది...
నగ్నత్వం అంటే దుస్తుల లేమి కాదని,
దృష్టి లోపమే అసలు దిగంబరత్వమని!
ఆనాడు స్త్రీ కాదు,
ఈ సమాజమే సరైన వస్త్రం ధరిస్తుంది.

- కోటం చంద్రశేఖర్
94920 43348

పురాతనమే పరిమళం

నడిచొచ్చే తోవను
నెమరువేసుకునే పనిలో
కాసేపు, కాలానికి కళ్లెం వేసా
ఇప్పుడింకా అక్కడే,
వసంతాలాడుతూ
కేరింతలు కొడుతూనే ఉంది

తోక బరువైన ప్రతిసారీ
పొలబారుతున్న వర్తమానానికి
గతం అనుభవాల లేపనాన్ని
కళ్ళముందే కట్లుగట్టి
బతుకు పట్టాలెక్కిస్తున్నా!

నిబిడిలేని నిటారుతనాన్ని
మర్మం ఎరుగని కొలమానాన్ని
నగుబాటే లేని నిక్కచ్చితనాన్ని
కాలం చెక్కిళ్ళపై,
పుట్టుమచ్చలుగా చెక్కుతున్నా

గుండె పొదల్లో పొదిగిన
పూర్వీకుల అడుగుజాడల్నీ,
గుప్పెడు మట్టి నుండి రాలిన
పుట్టెడు ప్రేమానురాగాల్నీ
కాలం సొరుగులో పదిల పరచి
కొత్త గాయాలపై పసరుగా పూస్తున్నా!

అనుభూతులు కాలాతీతం కాదు
జ్ఞాపకాలన్నీ కాలాలకే అతీతం
వాసనైతే పురాతనమే గానీ
భవిష్యత్‌కైతే అదే పరిమళం

-వినోద్ కుత్తుం
96343 14502

పాలపిట్ట కవితల పోటీ

చిన్నినారాయణరావు సాహితీ ఫౌండేషన్ (నెల్లూరు), 'పాలపిట్ట' మాస పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో కవితల పోటీ నిర్వహిస్తున్నది. వస్తువు ఏదైనా నవ్యత, భావోద్వేగం ఉన్న కవితలకు ప్రాధాన్యం ఉంటుంది. పోటీకి ఒక్కొక్కరు ఒక కవిత మాత్రమే పంపాలి. అలాగే ఇంతకుముందు ఎక్కడా (సోషల్ మీడియాతో సహా) ప్రచురితం కానిదై ఉండాలి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 5000, రూ. 3000, రూ. 2000, మరో పది ఉత్తమ కవితలకు రూ. 500 చొప్పున ప్రత్యేక బహుమతులు అందజేస్తారు. ఎంపికైన కవితలు 'పాలపిట్ట'లో ప్రచురితమవుతాయి. ఫలితాలు ప్రకటించేవరకు కవులు తమ కవితలను ఎక్కడా పోస్ట్ చేయరాదు. ఆసక్తి గలవారు తమ కవితలను నవంబర్ 30, 2026 లోపు "ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 3, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500 044" చిరునామాకు గానీ, palapittamag@ gmail.com కు గానీ పంపించగలరు. ఫలితాలు డిసెంబర్ 20, 2026న ప్రకటించబడతాయి. వివరాలకు 94900 99327 నంబరును సంప్రదించవచ్చు.

-గుడిపాటి

నిర్వహణ :
విల్సన్‌రావు కొమ్మవరపు
సాహితీ సంపాదకులు
k.wilsonrao@gmail.com

పీడనపై సంధించిన బాణాలు రాజేశం కవితలు

చలనశీలమైనది సమాజం. శరవేగంతో మారుతున్న వ్యవస్థల్లోని మార్పులను సృజనకారులైన రచయితలు, కవులు ఎప్పటికప్పుడు పసిగడుతుంటారు. కాలానికి అనుగుణంగా మారుతున్న ఆలోచనలను అర్థం చేసుకుంటూనే తమ రచనల ద్వారా కొత్త దారిని నిర్మించడానికి కలగంటుంటారు. ఆ స్వాప్నిక జగత్తును అక్షరాల్లో మన కళ్ళముందు దృశ్యమానం చేస్తారు. అన్ని వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో సమాజంలో జీవించాలని వాళ్ళు తమ రచనల ద్వారా ఆకాంక్షిస్తారు. తమ చుట్టూ అల్లుకున్న ఆధిపత్యపు పెత్తనాన్ని సహించకుండా ఆగ్రహంతో నిలదీస్తారు. ఆ కోవకు చెందిన యువకవి తోకల రాజేశం. అన్యాయాన్ని ధిక్కరించడానికి ఏ రకమైన పోరాటానికైనా వెనుకడుగు వేయకూడదని కవిత్వాక్షరాల్లో ఉద్బోధిస్తున్నారు. జీవన పోరాటంలో గెలుపోటముల గురించి తలుచుకుంటూ దిగులు చెందకుండా ప్రయత్నం చేయాలనే దృఢమైన సంకల్పంతో 'ఆట సాగుతూనే ఉంటది' అనే కవితా సంపుటిని వెలువరించారు.

జీవితమంటే సుఖదుఃఖాల కలయిక. జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. కొన్ని సాధారణమైనవి కావచ్చు, మరికొన్ని సిద్ధాంతపరమైన భావజాలాలకు సంబంధించినవి కావచ్చు. నీవెటువైపు నిలబడతావన్నదే అత్యంత ముఖ్యమైనది. అందుకనే ఒక స్పష్టమైన నిర్ణయంతో ముందుకు సాగాలనే తోకల రాజేశం ఆకాంక్షను 'ఆట సాగుతూనే ఉంటుంది' కవితలో వ్యక్తీకరిస్తున్నారు.

సామాజిక చైతన్యానికి దోహదపడే శిబిరంలో చేరి తమ సత్తాను చాటాలని కవి ఆశిస్తున్నాడు. ఎటూ తేల్చుకోకుండా స్తబ్ధుగా మాత్రం ఉండకూడదు. విజయం గురించి ఆలోచిస్తూ కాలయాపన చేయకుండా సమయస్ఫూర్తితో జీవన పోరాటాన్ని కొనసాగించాలని ఈ కవితాపాదాల్లో వ్యక్తం చేస్తున్నారు.

'ఎప్పుడు ఆట ఆటగానే సాగదు అకస్మాత్తుగా యుద్ధమై కాలు దువ్వుతుంది ఏదో ఒక శిబిరంలో దూకి నెత్తురో కన్నీళ్ళో పారించక తప్పదు ఆటగానో యుద్ధంగానో బతుకును జోడెద్దుల బండిలా అదిలించక తప్పదు నేను రెండు శిబిరాలుగా చీలినా సరే ఆట మాత్రం సాగుతూనే ఉంటుంది'.

నీకొక దారిని చూపించేది పుస్తకం. నిన్ను నిన్నుగా నిలబెట్టేది పుస్తకం. ఒక ఆత్మీయమైన మిత్రునిలా నీ వెంట నడిచేది పుస్తకం. సుఖదుఃఖాల కలబోతలకు నిలువుటద్దం పుస్తకం. అందుకనే పుస్తకంలోని విషయాలు మార్గదర్శిలా స్ఫూర్తినిస్తాయి. అంతరంగంలో చెలరేగుతున్న భావాలకు చక్కని రూపాన్నిచ్చేది పుస్తకం. సమాజంలోని అంధకారాన్ని పుస్తకం దీపం వెలుగులో అవగతం చేసుకుంటూ పుస్తకం అందిస్తున్న ఆలోచనలను కవితా రూపంలో వ్యక్తం చేయడం మనందరినీ ఆకట్టుకుంటుంది. మనిషి అంతరంగంలోని భావాలను నిరంతరం మార్చుకోవడానికి సమాజంలోని అనేక కథనాలు దోహదం చేస్తాయి. 'పుస్తకం' కవితలోని ఈ చరణాల ద్వారా పుస్తకం తనను నిజమైన మనిషిని చేసిందని సాహసోపేతంగా కవి ప్రకటించుకోవడం అభినందనీయమైనది.

కలుషితం కాని నవ్వులతో
లోలోపలి చీకటినంతా కడిగేసి
నా ఇంటి దీపం లెక్క పుస్తకం
నా చేతిలోని కాగడా అవుతుంది
పుస్తకం నా చేతిలోనుంచి
సూటిగా రక్తంలోకి పరుగెత్తుతుంది
నన్ను నిజమైన మనిషిని చేస్తుంది'

భావాలను వ్యక్తం చేయడానికి, గ్రహించడానికి అనువైన సాధనం మన మాతృభాష. తెలంగాణ మాతృభాషలోని సొగసును ఆస్వాదించడానికి ప్రజలతో మమేకం కావాలి. రాజేశం వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి రీత్యా సాహితీకారుడు. రోజూ పాఠశాలకు వెళ్ళడానికి బస్సులో ప్రయాణం చేస్తుంటాడు. వివిధ గ్రామాలకు చెందిన ఆడవాళ్ళు తమ సహజమైన సంభాషణల్లో రకరకాలైన పదాలతో కూడిన అచ్చమైన భాషను మాట్లాడుతుంటారు. 'మట్టి భాష' కవితలో భాషను బతికిస్తున్నది వాళ్ళేనని చెప్పడం సమంజసమైనది. మాతృభాషలో విద్యను అభ్యసించకుండా ఆంగ్లంలో అభ్యసించి మాతృభాషను మరుస్తున్న నేటి దుస్థితికి కలతచెందిన కవి మన భాషను రక్షించుకోవాలని పిలుపునిస్తున్నారు.

'మా ఊరి నుంచి/మంచిర్యాలకు పోయే బస్సులో కూసుంటే/ అమ్మలక్కల చీరకొంగుల నుంచి/ రాలిపడే మాటల్లోని తెలుగు తల్లి/ కాళ్ళకు చేతులకు వెండి/ కడియాలు పెట్టుకున్న/ నిండు ముత్తైదువలా కనిపిస్తుంది/ చదువుకున్నోళ్ళంతా భాష నోట్లో మట్టి కొడుతుంటే/ భాషకింత మట్టిని పూసి బతికించుకుంటున్నది వాళ్ళే'

ఈ శతాబ్దిలో ఎదుర్కొన్న అతిపెద్ద విపత్తు కరోనా వైరస్. కోట్లాది మంది మరణపు అంచుల దాకా వెళ్ళివచ్చారు. లెక్కలేనంత మంది ప్రాణాలు వదిలారు. కంటికి కనిపించని సూక్ష్మజీవి ప్రపంచాన్ని గడగడలాడించింది. మనుషుల మేధాశక్తిని ప్రశ్నించింది. మానవ సంబంధాల్లోని అమానుషత్వాన్ని చూపింది. స్పందించిన మానవత్వాన్ని కూడా చాటింది. మనుషుల ప్రాణాలు పిట్టల్లా రాలుతుంటే కాపాడే ప్రయత్నాలు కూడా ముమ్మరంగా సాగాయి. మనిషే గెలుస్తాడనే ఆశను రచయితలు, కవులు తమ రచనల ద్వారా చాటారు. కరోనా కాలంలోని దుర్భరమైన పరిస్థితులను వివరిస్తూనే మానవత్వాన్ని చాటిన కవిత 'మనిషే గెలుస్తాడు'. మనిషికి మనిషి తోడుగా నిలబడితే దేన్నైనా ఎదిరించవచ్చని వెల్లడించిన తీరు మనల్ని ఆకట్టుకుంటుంది.

'మనిషి కోసం/ మనిషిని నిలుపుకోవడం కోసం/ మనిషిని గెలిపించుకోవటం కోసం ఖబడ్దార్!/ నువ్వెన్ని కొత్త రూపాలు తొడుక్కొని వచ్చినా/ ఇక్కడ మనిషే గెలుస్తాడు'

మనకు స్ఫూర్తినిచ్చిన మహనీయుల, ప్రజాకవుల జయంతి, వర్ధంతుల సందర్భాల్లో వారిని స్మరించుకుంటూ, మనల్ని వదిలి కానరాని లోకాలకు వెళ్లిన చిరస్మరణీయులను అశ్రునయనాలతో తలుచుకుంటూ కవులు కవితలు రాస్తుంటారు. ఈ కవితా సంపుటిలో అలాంటి కవితలు కొన్ని ఉన్నాయి.

ప్రజాకవి కాళోజీ నారాయణ గారిపై 'రా! కాళోజీ!', తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి గురించి 'సమర వీరులు', అగ్రకుల దురహంకారంపై కలమెత్తిన కవి గుర్రం జాషువా గురించి 'విశ్వ నరుడు', తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ గురించి 'పాట నిదురవోయింది', ప్రజా యుద్ధ నౌక గద్దర్ గురించి 'మరణం లేని పాట', తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గురించి 'చదువుల తల్లి', భారతరత్న అంబేద్కర్ గురించి 'మేరా భారత్ మహాన్, రాజ్యాంగ దీపధారి' వంటి కవితల్లో ఆయా మహనీయుల జీవనయానాన్ని కవి మనకు పరిచయం చేస్తారు. అన్యాయాలపై ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్న ప్రగతివాదులను నానా రకాల పేర్లతో కారాగారాల్లో బంధిస్తున్నారు.

అవిటితనంతో బాధపడుతున్న ప్రొఫెసర్ సాయిబాబాను అండా సెల్లో నిర్బంధించడం బుద్ధిజీవులను ఆలోచింపజేసింది. అక్షరాన్ని బెదిరించలేరని, దానికి మరణం లేదని చాటుతూనే 'అందుకే అది అక్షరం' అయిందని తన మార్గాన్ని చాటాడు కవి. సాయిబాబా మరణంతో అక్షరం మూగబోదని భరోసానిస్తాడు కవి. సృజనకారులెప్పుడూ ప్రజల పక్షమేనని గళమెత్తి పిలుపునిచ్చిన కవిత ఇది.

'ఈ రోజు మాటల కళ్ళకు/ గంతలు కడతానంటావు/ పాటల గొంతుకు ఉరి బిగిస్తానంటావు/ ఆటల నిండా నీ సింగారమే కనిపించాలంటావు/ ప్రశ్నను జైల్లో వేసి/ చిత్రహింసలు పెట్టాలనుకుంటావు'

మనిషిని మనిషిగా నిలబెట్టేది సాహిత్యం. తాత్కాలిక కీర్తి కోసం సాహిత్యాన్ని తాకట్టు పెడుతున్న వాళ్లకు చెంపపెట్టులా రాసిన కవిత 'నిన్ను చూస్తే జాలేస్తున్నది'. నేటి వర్తమాన పరిస్థితుల్లో శాలువాల కోసం, అవార్డుల కోసం రకరకాలుగా వెంపర్లాడుతున్న తీరుకు ఆశ్చర్యపోతూనే నీతి వాక్యాలను బోధిస్తున్నాడు కవి. సాహిత్యం అంటే ప్రజలను కదిలించేది, వ్యవస్థల దుర్మార్గాన్ని ప్రశ్నించేది అని బలంగా మాట్లాడుతున్నాడు కవి రాజేశం. సాహితీ విలువలకు తిలోదకాలిస్తున్న వైనానికి అద్దం పడుతున్నాయి ఈ కవితా పాదాలు.

'నువ్వు అంగీకరించవు కానీ/ సాహిత్యమంటే నీ మెడలో వాలిన దండలు కావు/ నువ్వు తెచ్చుకున్న బిరుదులు కావు/ నిన్ను ముంచెత్తిన శాలువాలు అసలే కావు/ అక్షరాలంటే/ నువ్వు పెట్టుకున్న కిరీటం మీది రంగురాళ్ళు కానేకావు/ కేవలం కీర్తి కోసమే అక్షరం వెంట పడిన/ నిన్ను చూస్తుంటే నిజంగా సిగ్గేస్తున్నది'

విప్లవాత్మకమైన భావాలు, అంబేద్కర్ భావజాలంతో కూడిన ఆలోచనలు, వాస్తవ పరిస్థితులను వివరిస్తూనే బాధ్యతలను గుర్తు చేస్తున్న సందర్భాలు, తన బెస్త కులంలోని సాధక బాధకాలు ఈ కవితల నిండా మనకు కనిపిస్తాయి. అందుకని పీడనపై సంధించిన శరాలు తోకల రాజేశం కవితలంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు.

గుప్పెడు ప్రేమ కోసం తపిస్తూనే, సమూహ జీవనాన్ని ఆకాంక్షిస్తూనే, మేము భారతీయులం అంటూ నడిచి వచ్చిన దారిని మరువకుండా 'సాహిత్యమంటే.. ఆధిపత్యం మీదికి ప్రశ్నల రాళ్లను ఒడిసిపట్టి/గురి చూసి విసిరే ఒడిశెలేనని' సగర్వంగా ప్రకటిస్తున్న రాజేశం కవిత్వాన్ని ఆస్వాదిద్దాం.



- గోపగాని రవీందర్
9440979882